



వీఐపీల భద్రతలో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వీఐపీల భద్రత విషయంలో వ్యక్తిగత భద్రతాధికారు(పీఎస్‌ఓ)లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రత్న ఆదేశించారు. స్థానిక జిల్లాపోలీసు కార్యాలయంలో జిల్లాలో వీఐపీల భద్రతా విధులు నిర్వర్తిస్తున్న పీఎస్‌ఓలకు మూడురోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. వీఐపీలకు భద్రత కల్పించడం సవాళ్లతో కూడుకున్నదన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలసత్వాన్ని దరి చేరనీయరాదని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో మాయలు..!

బోగస్ డ్వాక్రా సంఘాల సృష్టి.. రూ.కోట్లలో రుణాల మంజూరు.. మొత్తం స్వాహా..

- చక్రంతిప్పిన మహిళా ఉద్యోగి
- పోస్టు మహిళా వాచ్‌మన్.. చేసేది సీఓ వృత్తి..
- వైసీపీ హయాంలో అవినీతి బాగోతం
- రికవరీకాక బ్యాంకర్ల ఆందోళన

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో ఓ మాంత్రికురాలు పుట్టుకొచ్చింది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో మహిళా వాచ్‌మన్‌గా చేరి.. మెప్మాలో ఉద్యోగిగా మారారు. అక్కడితో ఆగలేదు. బోగస్ మహిళా సంఘాలను సృష్టించారు. వాటికి బ్యాంకుల్లో రుణాలు ఇప్పించారు. అలా.. రూ.కోట్లలో స్వాహా చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారులు తొక్కారు. బోగస్ సంఘాలపై అధికారిక ముద్ర వేయించారు. వాటాల్లో తేడాలొచ్చి అడ్డంగా దొరికిపోయారు. దీంతో తేరుకున్న బ్యాంకుల అధికారులు.. బోగస్ సంఘాల పేరిట ఇచ్చిన రుణాలు రికవరీ కాక.. మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మెప్మాలో తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. ఇప్పటికే బోగస్ సంఘాల మాటున రూ.3.5 కోట్లదాకా రుణాలు ఇప్పించి, స్వాహా చేసినట్లు తేలింది. ఇంకా ఎన్ని బోగస్ సంఘాలు బయటకు వస్తాయోనని అటు బ్యాంకులు, ఇటు మెప్మా అధికారుల్లో టెన్షన్ నెలకొంది. పట్టణంలోని ఆరు బ్యాంకుల్లో డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇస్తున్నారు. రెండు బ్యాంకుల్లో మాత్రం భారీఎత్తున బోగస్ సంఘాలకు రుణాలిచ్చినట్లు సమాచారం.

సీఓగా అవతారమెత్తి

మున్సిపాలిటీలో వాచ్‌మన్‌గా మహిళ చేరింది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల అండతో ఏకంగా మెప్మా సీఓ (కమ్యూనిటీ ఆర్గనైజర్)గా అవతారమెత్తింది. అప్పటి అధికారపార్టీ నాయకుల ఎవరికి చెప్పితే వారికి బినామీ గ్రూపులు ఏర్పాటు



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

చేసి, వెంటనే రుణాలు మంజూరు చేయించినట్లు సమాచారం. ఇందుకు ప్రతిఫలంగా గ్రూపునకు రుణం మంజూరు చేయిస్తే రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు సభ్యుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ గ్రూపుల్లో తనకు తెలిసిన, పరిచయమున్న మహిళలను చేర్చి, వారి పేర్లతో ఆ మహిళా ఉద్యోగిని డబ్బు కాజేసినట్లు సమాచారం. వైసీపీ హయాంలోనే ఈ మహిళా ఉద్యోగి చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. దీంతో ఆ మహిళా ఉద్యోగి సీఓగా సంతకాలు చేసిన పత్రాలన్నింటినీ బయటకు తీయించి ప్రస్తుతం సీఎంఎంగా ఉన్న బండి వెంకటేశ్‌తో సంతకాలు చేయించి, అతడికి కూడా భారీఎత్తున ముడుపులు ముట్టజెప్పినట్లు సమాచారం.

దందా సాగించారిలా..

ధర్మవరం మెప్మాలో నకిలీ మహిళా సంఘాలను సృష్టించి, బ్యాంకులో పెద్దఎత్తున రుణాలు పొందిన వ్యవహారంలో సిటీ మిషన్ విభాగంలోని అధికారి, కొందరు రీసోర్స్ పర్సన్‌లు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. సీఎంఎం బండి వెంకటేశ్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సాధారణంగా డ్వాక్రా సంఘానికి రుణం ఇవ్వాలంటే అందులోని సభ్యులందరూ బ్యాంకుకు వెళ్లి స్వయంగా డాక్యుమెంట్ సమర్పించాలి. వారందరి సమక్షంలో రుణం మంజూరు చేయాల్సి ఉంటుంది. ఓ బ్యాంకులో సీఎంఎం మాట నమ్మడంతో ప్రస్తుతం వారి పరిస్థితి ముందు నెయ్యి.. వెనుక గొయ్యిలా మారింది. గ్రూపు సభ్యులకు తెలియకుండానే సదరు అధికారి మాట నమ్మిన బ్యాంకర్లు సంబంధిత సీఓ, సంఘం సభ్యులను పరిశీలించకుండానే రుణాలు ఇచ్చేసినట్లు తెలుస్తోంది. సీఓ ప్రమేయం ఉంటే నకిలీ సంఘాల సభ్యుల బాగోతం ఎక్కడ వెలుగులోకి వస్తుందోనన్న భయంతో వారిని పక్కన పెట్టి తతంగం ఆయన నడిపినట్లు తెలుస్తోంది.

మామూళ్ల మత్తు

గ్రూపుసభ్యులు రుణాల కోసం బ్యాంకర్ల వద్దకు వెళితే రకరకాలు పత్రాలు కావాలంటూ తిప్పుకుంటారు. మామూళ్లు ఇస్తే మాత్రం ఠక్కున రుణాలు మంజూరైపోతాయనడానికి ధర్మవరం మెప్మాలో అక్రమాలే నిదర్శనం. మామూళ్లకు కక్కుర్తిపడి కళ్లు మూసుకుని సంతకాలు చేయడం ద్వారా బోగస్ సంఘాలు పుట్టుకొచ్చాయి. సభ్యుల నుంచి రికవరీ చేయలేని పరిస్థితి దాపురించింది. దీంతో రుణాలు పేరుకుపోయాయి. వాటిని ఎలా రికవరీ చేయాలో అర్థంకాక బ్యాంకర్లు తలలు బాదుకుంటున్నారు.

విభేదాలే పట్టించాయా?

అధికారుల్లో తలెత్తిన విభేదాలే మెప్మాలో అవినీతిని బట్టబయలు చేశాయని తెలుస్తోంది. పది రోజుల క్రితం మంజూరైన రూ.కోటికిపైగా రుణాలను ఓ బ్యాంకులో పంపకాలు జరిపినట్లు



తెలుస్తోంది. దీంతో అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పూర్తిస్థాయిలో విచారించడంతో రుణాలు పొందిన సంఘాలు బోగస్‌వని తేలింది. ఆ మొత్తాన్ని రికవరీ చేసేందుకు మున్సిపల్ కార్యాలయం చుట్టూ బ్యాంకు అధికారులు తిరగాల్సి వస్తోంది. ఆ బోగస్ సంఘాల్లోని సభ్యులు ఎక్కడున్నారో తెలుసుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. స్థానిక మరో బ్యాంకులో రూ.2కోట్లకుపైగా మొండి బకాయిలు పేరుకుపోవడంతో అవి కూడా నకిలీవై ఉండవచ్చన్న కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం.

అక్రమాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

ధర్మవరం మున్సిపాలిటీలో నకిలీ మహిళా సంఘాల పేరుతో బ్యాంకు రుణాలు పొందడంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- విశ్వజ్యోతి, పీడీ, మెప్మా

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం

డీఐఈఓ రఘునాథరెడ్డి



తరగతులను పరిశీలిస్తున్న డీఐఈఓ

కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి సంకల్ప 2025 కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. తద్వారా ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో సంకల్ప తరగతులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 22 ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3872 మందికి, సెకండియర్‌లో 3063 మందికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు చేపడతామన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని ఆయన వివరించారు.

అర్జీల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 232 అర్జీలు సమర్పించారు. వాటిని కలెక్టర్ టీఎస్ చేతన్ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల విషయంలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫిర్యాదులపై పర్యవేక్షించేందుకు మండలస్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆ విషయాన్ని అర్జీదారులకు మొబైల్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కలెక్టర్ వివరించారు.

అడవికి నిప్పు.. మనిషికి ముప్పు..

అడవులకు నిప్పుపెట్టడం అంటే మనిషికి ముప్పు తెచ్చుకోవడమేనని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. అడవికి నిప్పు పెట్టకూడదని తెలియచేస్తూ జిల్లా అటవీశాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అడవికి అనుకుని ఉన్న 302 గ్రామాల్లో గొర్రెలు, పశువుల కాపర్లు, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అడవుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, అటవీశాఖాధికారి చక్రపాణి, ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 70 అర్జీలు వచ్చాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదుల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ కిందపడి విద్యార్థిని మృతి

గుట్టుచప్పుడు కాకుండా ఖననం

స్థానికుల సమాచారంతో రంగంలోకి పోలీసులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని పి.కొత్తపల్లి సమీపాన గల ఏరులో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి విద్యార్థిని రిషిత (13) మృతిచెందింది. రొద్దం ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.కొత్తపల్లికి చెందిన ఉప్పర శ్రీరాములు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె రిషిత పెద్దమంతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేది. శ్రీరాములు వాగులు, వంకల్లోని ఇసుకను ట్రాక్టర్‌లో వేసుకుని, విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు.

ఆదివారం రాత్రి కూలీల విరామ సమయంలో భార్య వెంకటలక్ష్మి, కుమార్తె రుషితతో కలిసి సమీపంలోని వాగులో ఇసుకను నింపుకోవడానికి వెళ్లారు. ఇసుకను నింపుకుని వస్తుండగా వాగులో ఇసుక ఇరుక్కుంది. రివర్స్ చేసే క్రమంలో ట్రాక్టర్ వెనుక చక్రాల కింద పడి రిషిత నుజ్జునుజ్జయింది. విషయం ఎవరికీ చెప్పకుండా విద్యార్థిని మృతదేహాన్ని కుటుంబీకులు పూడ్చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, విచారించారు. రిషిత తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు ఫుడ్ కమిషన్ రాక

పుట్టపర్తిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈనెల 11న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి రానున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 11, 12 తేదీల్లో కదిరి, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం తదితర మండలాల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటిస్తారన్నారు. కేజీబీవీలు, పెట్రోల్ బంకులు, సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేస్తారని జేసీ తెలిపారు. సమీక్షలో డీఎస్‌పీ వంశీకృష్ణారెడ్డి, డీఈఓ కిష్టప్ప, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, జిల్లా వైద్యాధికారి మంజువాణి, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

అట్టహాసంగా కళాఉత్సవ్



గెలుపొందిన విద్యార్థులతో డైట్ కళాశాల అధ్యాపకులు



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

బుక్కపట్నం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): స్థానిక డైట్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కళాఉత్సవ్ అట్టహాసంగా సాగింది. ఉమ్మడి జిల్లాలోని 10 కళాశాలల నుంచి 130మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలతో అలరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారికి డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు కళల్లోనూ రాణించాలని సూచించారు. రాప్తాడు పాఠశాల నుంచి కీర్తన, అఖిరానందన్, భవిష్యకుమార్, రాయదుర్గం బాలికల పాఠశాలకు చెందిన సాయిశ్రీ, దీప్తి, బుక్కరాయసముద్రం నుంచి గంగమ్మ, శ్వేత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణ, గోవిందరాజులు, శ్రీనివాసులు, పీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

కబ్జా చేసి.. వైసీపీ నాయకుడి దౌర్జన్యం

సర్వేకి వెళ్లిన రెవెన్యూ అధికారులు, పోలీసులతో వాగ్వాదం



అధికారులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు.. ఒంటిపై పెట్రోల్ పోసుకున్న మంజుల



పెనుకొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో శోత్రియం భూమిని ఫేక్ రిజిస్ట్రేషన్ ద్వారా కబ్జా చేసిన వైసీపీ నాయకుడు.. తాజాగా సర్వే చేసేందుకు వెళ్లిన అధికారులపై దౌర్జన్యానికి దిగాడు. తన అనుచరులను ఉసిగొల్పాడు. పెనుకొండ మండలం బొజ్జిరెడ్డిపల్లిలో సర్వే నంబరు 28/2లో 28సెంట్ల శోత్రియం భూమి ఉంది. భూమికి సంబంధించిన వారు లేకపోవడంతో శెట్టిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కన్నేశాడు. తన భార్య అర్చన పేరిట బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021లో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్నుంచి భూమిని తన ఆధీనంలో ఉంచుకున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. స్థలం కోసం రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్వే మొదలెట్టారు. సోమవారం గ్రామంలోని శోత్రియం భూములను పరిశీలించారు. ఈ క్రమంలో కృష్ణారెడ్డి.. తన అనుచరులతో కలిసి అధికారులపై దౌర్జన్యానికి దిగాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ టౌన్: బొజ్జిరెడ్డిపల్లిలోని శోత్రియం భూమిని సర్వే చేసేందుకు ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో తేజారెడ్డి, సర్వేయర్ భరత్‌కుమార్, పోలీసులు వెళ్లారు. ఆ సమయంలో కృష్ణారెడ్డి బంధువు మంజుల ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో కళ్లలోకి పెట్రోల్ పడింది. కళ్లు మంట కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

మూడు ముక్కలాట..!

- మూడు శాఖల మధ్య నలుగుతున్న వీఎస్‌ఏలు
- గతంలో ఎరువులు, విత్తనాల అమ్మకం పనులు
- మాతృశాఖలో విలీనం చేయాలని వేడుకోలు
- సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి



సాగవుతున్న మల్బరీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్(వీఎస్‌ఏ)లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, సచివాలయ ఉద్యోగాల భర్తీలో భాగంగా వీఎస్‌ఏలను నియమించారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీల్లో సెరికల్చర్ చదివినవారిని అర్హులుగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నియామకం సందర్భంగా పట్టుపరిశ్రమ శాఖలో టెక్నికల్ ఉద్యోగమని చెప్పారు. అయితే వారిని మూడుశాఖలకు ముడిపెట్టారు. వీరి ఉద్యోగం పట్టు పరిశ్రమ శాఖలో.. పర్యవేక్షణ మాత్రం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌ది. జీతాలు ఇచ్చేది పంచాయతీరాజ్ శాఖ. ఇలా మూడు ముక్కలాటల తమ ఉద్యోగం ఉందని పలువురు వీఎస్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెరికల్చర్ పనులు కాకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ సంబంధిత పనులు చేయడం. ఏపీ ఎంఐపీ, మార్కెటింగ్ చేయించడం. క్రాప్‌బుకింగ్, విత్తనాలు, ఎరువులు అమ్మడం తదితర పనులకు గత ఐదేళ్లుగా పరిమితం చేశారని పేర్కొన్నారు. వీఎస్‌ఏలుగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా పట్టు రైతులకు ఎలాంటి సేవలు అందించాలో సెరికల్చర్ అఫ్ కమిషనరేట్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేటాయించిన విధులు నిర్వహించేందుకే వీఎస్‌ఏల ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు 2019 జూలై 17న 631 జీఓను జారీ చేసింది. అయినా గత ప్రభుత్వం వాటిని విస్మరించిందని వాపోతున్నారు.

ఎరువుల అమ్మకానికి పీహెచ్‌డీనా..?

ఉమ్మడి జిల్లాలోని 150 వీఎస్‌ఏల్లో చాలామంది సెరికల్చర్ కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీలు చేశారు. విద్యాభ్యాసంలో భాగంగా మల్బరీ పంటపై అనేక ప్రాజెక్టులు చేశారు. సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన మల్బరీ ఆకును పండించవచ్చు. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టు పురుగులు మేలురకమైన గూళ్లను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా రైతులకు అధిక ఫలసాయం దక్కుతుంది. పంటసాగులో, పట్టుగూళ్ల ఉత్పత్తి సమయంలో వ్యాధుల నివారణకు అవసరమైన కొత్త సాంకేతిక పద్ధతులు అవలంబించాలి. చంద్రికల నుంచి పట్టుగూళ్లను వేరుచేసి మార్కెట్‌కు తరలించేవరకు కకూన్‌లు సహజసిద్ధమైన నాణ్యత కోల్పోకూడదు. ఇలాంటివాటిపై పరిశోధన చేసిన తమతో పట్టు రైతులకు ఉపయోగపడే పనులు కాకుండా ఐదేళ్ల నుంచి ఎరువులు, విత్తనాలు అమ్మిస్తున్నారని వీఎస్‌లు వాపోతున్నారు. వీటికోసం సెరికల్చర్‌లో పీజీలు, పీహెచ్‌డీలు చేయాలా? అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వీఎస్‌ఏలు నిర్వహించాల్సిన విధులు

- సెరికల్చర్ కార్యకలాపాలు చేపట్టేందుకు రైతులను గుర్తించడం.
- మట్టినమూనాలు సేకరించడం, భూసార పరీక్షల రికార్డులను నిర్వహించడం.
- మల్బరీ ప్లాంటేషన్ చేపట్టేందుకు రైతులకు సాంకేతిక మార్గదర్శకం చేయడం, అందుకు అవరమైన పరికరాలను అమర్చడం.
- పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి కావాల్సిన పెంపక పరికరాలను అందజేసి సూచనలు చేయడం.
- వ్యాధుల్లేని పట్టుపురుగు గుడ్ల సరఫరా కోసం రాష్ట్ర, కేంద్ర పట్టు పురుగు విత్తనోత్పత్తి కేంద్రాలు, గ్రెయినేజీలతో సమన్వయం చేసుకోవడం.
- రైతులకు పట్టుపురుగుల పెంపకం, కకూన్ మార్కెటింగ్ కోసం సాంకేతిక మార్గదర్శకత్వం చేయడం.
- మల్బరీ, సిల్క్‌వార్మ్ వ్యాధులు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్‌మేనేజ్‌మెంట్ నివారణ, నియంత్రణపై అవగాహన కల్పించడం.
- మల్బరీ గార్డెన్ నిర్వహణలో సేంద్రియ, సహజ వ్యవసాయంపై అవగాహన కల్పించడం.
- రైతులకు మేలు చేసేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం.
- సెరికల్చర్ యూనిట్లు తీసుకోవడానికి రైతులకు బ్యాంకు రుణాలను అందించడం.
- రైతుల డేటా డాక్యుమెంటేషన్‌ను నిర్వహించడం.
- శిక్షణలు, వర్క్‌షాపులు నిర్వహించడం. ఫీల్డ్ విజిట్‌లు చేసి తగిన సాంకేతిక సలహాలివ్వడం.
- సెరికల్చర్ ఆఫీసర్(ఎస్‌ఓ), అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్(ఏఎస్‌ఓ)ల పరిధిలో ఆయా మండలాల్లో సేవలందించడం.
- ఎస్‌ఓ, ఏఎస్‌ఓలకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలి.
- ఎప్పటికప్పుడు ప్రభుత్వం అప్పగించిన అన్ని ఇతర పనులకు హాజరుకావాలి.

మూడుశాఖలు, ముప్పుతిప్పలు

పట్టుపరిశ్రమ శాఖలో పనిచేసేందుకు నియమించిన వీఎస్‌ఏలు మూడుశాఖలకు అనుబంధంగా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరింది సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో అయితే పర్యవేక్షించేంది అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్. జీతాలు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లిస్తున్నారు. ఇలా మూడు శాఖల మధ్య ముప్పుతిప్పలు పడుతున్నామని వీఎస్‌ఏలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీఎస్‌ఏలు విధులకు హాజరయ్యే రైతు సేవాకేంద్రాలకు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. సెలవు కావాలంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన అనుమతిస్తే లీవ్‌లెటర్ సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్తుంది. ఈ నేపథ్యంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మాతృశాఖ అయిన పట్టు పరిశ్రమ శాఖలో విలీనం చేస్తే ఎవరు, ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో సమాచారం ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఉద్యోగాలు సక్రమంగా నిర్వహించేందుకు వీలుంటుందని వారు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని గత ప్రభుత్వంలో విన్నవించినా, లేఖలు అందజేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

సందిట్లో సడేమియా

మూడుశాఖల మధ్య ఎవరికి ఎవరో తెలియని పరిస్థితులను కొంతమంది వీఎస్‌ఏలో బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఫలానా పనులు చేయాలని పైఅధికారులు ఏదైనా చెబితే నాకు వేరేపని అప్పగించారు. అక్కడ ఉన్నానంటూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు తోటి వీఎస్‌ఏల నుంచే వినబడుతున్నాయి. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎస్‌ఓలు, ఏఎస్‌ఓలను సైతం బురిడీ కొట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రెటరీ ఇలా ఎవరు పని పురమాయించినా ఏదో ఒకశాఖ అధికారి పేరుచెబుతూ తప్పించుకుంటున్నారని అధికార వర్గాలు మండిపడుతున్నాయి.



జిల్లాకేంద్రంలోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయ ముఖద్వారం

మాతృశాఖలో విలీనం చేయాలి



ఉమ్మడి జిల్లాలోని 150మంది వీఎస్‌ఏలు సెరికల్చర్‌లో ప్రత్యేకమైన కోర్సులు చేసిన విద్యావంతులు. మాతృశాఖలో విలీనంచేస్తే.. మల్బరీ రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించడానికి అవకాశం ఉంటుంది. పట్టుపరిశ్రమ, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ మూడు శాఖలకు వీఎస్‌ఏల ఉద్యోగాన్ని ముడిపెట్టారు. వీఎస్‌ఏలను మాతృశాఖలో కలపాలని గత ప్రభుత్వంలో అనేకసార్లు వేడుకున్నాం. పట్టించుకోవపోవడంతో పోరాటాలు చేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మడకశిరకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారు. మరోసారి మంత్రి నారా లోకేశ్, సెరికల్చర్ కమిషనర్‌ను కలిసి వివరిస్తాం.

-డాక్టర్ అంజనరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు,
గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

ఎస్‌ఆర్‌లు మా శాఖలోనే..



వీఎస్‌ఏల సర్వీస్ రిజిస్టర్(ఎస్‌ఆర్)లు మాశాఖలోనే ఉన్నాయి. సాధారణ సెలవులు మినహా మెడికల్, మెటర్నటీ, మ్యారేజ్ వంటివాటికి ఎక్కువ రోజులు సెలవులు కావాలంటేనే అనుమతిచ్చే అధికారాలున్నాయి. వీఎస్‌ఏలను అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షిస్తుంటే, పంచాయతీరాజ్‌శాఖనుంచి జీతాలు ఇస్తున్నారు. విలీన అంశాన్ని రాష్ట్ర అధికారులు పరిశీలిస్తున్నారు. మా శాఖలో ప్రస్తుతమున్న అధికారులు, సిబ్బందితో మల్బరీసాగులో ప్రగతిని సాధిస్తున్నాము. వీఎస్‌ఏలు తోడైతే అవసరమైన ప్రాంతాల్లో విధులు కేటాయించవచ్చు.

-అంజనేయులు, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి

సాయుధ దళాల నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



సైనిక్‌నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ ప్రాణత్యాగాలు చేస్తున్న సైనికుల కుటుంబాల సంరక్షణ కోసం సాయుధ దళాల నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరులైన వీరజవాన్ల కుటుంబాలను ఆదుకోవడానికి ఉదారంగా అన్నివర్గాల ప్రజలు విరాళాలు అందజేయాలని కోరారు. విరాళాలు సైనిక సంక్షేమం కోసం ఖర్చుపెడతారన్నారు. సహకారం అందించి, సైనికుల రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులందరూ తమవంతు సాయం చేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వే సహాయ మంత్రికి ఎంపీ అంబికా వినతి

అనంతపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని రైల్వేశాఖ సహాయ మంత్రి (రైల్వే మినిస్టర్ ఆఫ్ స్టేట్) సోమన్నను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. పార్లమెంటులోని మంత్రి చాంబర్‌లో ఆయన్ను ఎంపీ సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతపురం, రాయదుర్గం, గుత్తి, హిందూపురం పట్టణాలకు సంబంధించి రైల్వే సమస్యలున్నట్లు వివరించారు. రాజధాని ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-బీదర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ -లాతూర్ ఎక్స్‌ప్రెస్‌ల ను అనంతపురం మీదుగా నడపాలన్నారు. టాటానగర్ - యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్- వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-జైపూర్, తిరుపతి-దోడహల్లి ఎక్స్‌ప్రెస్‌లు రాయదుర్గం మీదుగా నడపాల న్నారు. సంపర్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, కంగు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రాయల్ చెరువులో నిలిపేలా చూడాలన్నారు. వందే భారత్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లను హిందూపురంలో నిలపాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారని విన్నవించారు. గుంతకల్లు అనంతపురం నగరాలలో వివిధ చోట్ల అండర్‌పాసులు నిర్మించాలని కోరారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి యశ్వంత్‌పూర్ వరకు, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి హిందూపురం వరకూ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి అనంతపురం వరకు, హౌరా ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి నుంచి గుంతకల్లు వరకూ కొనసాగించాలన్నారు. మైసూర్ టు జైపూర్ ఎక్స్‌ప్రెస్ వారానికి రెండు మూడు రోజులు నడపాలని, యశ్వంత్‌పూర్ టు జైపూర్ వారానికి మూడు రోజులు నడపాలని ఆయన మంత్రిని కోరారు. హిందూపురం-బెంగళూరు మెము ట్రైన్‌లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. తిరుపతి-కదిరి దేవరపల్లి రైలుని తిరిగి ప్రారంభించాలన్నారు. గుంతకల్లు-చిక్ జార్జూర్ రైలు రోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపురం, హిందూపురం రైల్వేస్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన రైల్వేస్టేషన్లలో కోచ్ డిస్‌ప్లే బోర్డులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు, మరుగుదొడ్లు, తాగునీరు, సిట్టింగ్ ఫెసిలిటీస్, క్యాంటిన్, లైట్లు, ప్లాట్‌ఫామ్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే రైల్వేస్టేషన్లలో నిర్మాణాలు సరిగ్గాలేవో ఆ ప్రాంతాల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నేడు పింఛన్ల పరిశీలన

- డీఆర్‌డీఏ-వెలుగు పీడీ, డీఎల్‌డీఓ పర్యవేక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో భారీగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో జిల్లాలో ఒక గ్రామ-వార్డు సచివాలయాన్ని ఎంపిక చేశారు. ఇందుకు తనిఖీలకు పక్క మండలానికి చెందిన అధికారులను నియమించారు. ఒక్కో తనిఖీ బృందం 40పింఛన్లు మాత్రమే పరిశీలిస్తుంది. ఆయా సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారుల సంఖ్యను బట్టి ఎన్ని బృందాలు అవసరమో నిర్ణయిస్తారు. ఈ బృందం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తుంది. జిల్లాలో ఈ ప్రక్రియ మంగళవారం చేపట్టాలని సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

చియ్యేడు గ్రామంలో...

అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో పింఛన్లను పరిశీలిస్తారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, డీఎల్‌డీఓ లలితాబాయిల నేతృత్వంలోని 11బృందాలు పింఛన్ల తనిఖీ చేయనున్నారు. గ్రామంలో మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. ఇందులో వృద్ధులు 250మంది, వితంతువులు63, దివ్యాంగులు 54, అభయహస్తం 32, సఫాయి కర్మచారులు 8మంది, చేనేతలు 7, ఒంటరి మహిళలు 6, డప్పు కళాకారులు 3, తలసేమియా 2 మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల నుంచి అధికారులు పరిశీలనలో పాల్గొననున్నారు. ప్రతి బృందంలో ఒక మండల అధికారి, ఒక గ్రామ సచివాలయ ఉద్యోగి ఉంటారు.

సీఎం హామీలన్నీ నెరవేర్చాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు నేమకల్లులో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. సోమవారం సీఎంఇచ్చిన హామీలు, ఇప్పటివరకు అక్కడ కొనసాగుతున్న పనులతీరుపై కలెక్టర్.. అధికారులతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేమకల్లు సభలో సీఎం 27రకాల హామీలు ఇచ్చారన్నారు. ఆయా హామీల అమలుకు సంబంధితశాఖల అధికారులందరూ ప్రత్యేక దృష్టిపెట్టి కృషి చేయాలన్నారు. బొమ్మనహాళ్ మండలంలో బీసీ రెసిడెన్సియల్‌పాఠశాలఏర్పాటుకు స్థలసేకరణ చేపట్టి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. 12మందికి ఇళ్లు మంజూరు చేయాలని, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన అభివృద్ధి పనులకు 24గంటలలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ, హౌసింగ్ పీడీ, పీఆర్ఎస్ఈ, విద్యుత్ఎస్ఈ, డ్వామాపీడీ పాల్గొన్నారు.

15న అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు ఈనెల 15న అనంత క్రీడా గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి తెలిపారు. 2012 సెప్టెంబరు 1వతేదీ నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రికెట్ కిట్, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7702889365 నంబరులో సంప్రదించాలని కోరారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

- 474 బాక్సులు స్వాధీనం
- మొత్తం విలువ రూ.44 లక్షలు
- నలుగురు నిందితుల అరెస్టు
- ప్రధాన నిందితుడు 'బూసుపల్లి' పరారీ

అనంతపురం అర్బన్/ రాప్తాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ స్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవా మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి, విక్రయిస్తున్న అనంతపురానికి చెందిన నలుగురు నిందితులు అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మెన్ ఆనంద్‌లను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. రాప్తాడు మండలం రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన ఏపీ ధరల మేరకు రూ.44 లక్షల విలువైన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు వెంకటశివకుమార్‌రెడ్డి గతంలో పొలంలోని రేకుల షెడ్‌ను లీజుకు తీసుకొని గొర్రెల యూనిట్‌ను పెట్టినట్లు తెలిసింది. ఆ తర్వాత గొర్రెల యూనిట్‌ను పక్కన పెట్టి, అదే రేకుల షెడ్‌లో గోవా నుంచి తెచ్చిన అక్రమ మద్యాన్ని నిల్వ చేసి, మరో నలుగురి సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం.

సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించిన పోలీసులు

బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి, మరికొందరు గోవా నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు జిల్లాకు తీసుకొచ్చి, విక్రస్తున్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామికి రెండు రోజుల క్రితం సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐలు, ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు బృందాలుగా విడిపోయి ప్రధాన నిందితుడు, ఇతర నిందితుల కోసం గాలించారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ప్రధాన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో కారులో తిరిగినట్లు సమాచారం. ఇదే క్రమంలో తాను అక్రమంగా నిల్వ ఉంచిన రేకుల షెడ్ వద్దకు అతను వెళ్లినట్లు సమాచారం. సెల్ సిగ్నల్ ఆధారంగా సోమవారం సాయంత్రం రేకుల షెడ్ వద్దకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులకు అక్కడ మద్యం ఖాళీ అట్టపెట్టెలు ఉండటంతో రేకుల షెడ్‌లోకి వెళ్లి చూశారు. అక్కడ భారీగా గోవా మద్యం బాటిళ్లు ఉండటాన్ని గమనించారు. అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని సీజ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎక్సైజ్ పోలీసులు



రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన గోవా మద్యం

ప్రధాన నిందితుడు పరారీ



గోవా అక్రమ మద్యం నిల్వ, విక్రయంలో ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడితో కలిసి అక్రమ మద్యం నిల్వ, విక్రయించిన నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురానికి చెందిన అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మన్ ఆనంద్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడికోసం గాలింపును ముమ్మరం చేశారు. గోవా అక్రమ మద్యాన్ని చాకచక్యంగా పట్టుకున్న అధికారులు, సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అభినందించారు. ఈ దాడుల్లో అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్‌ఐ జాకీర్ హుస్సేన్, అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు లక్ష్మీసుహాసిని, సునంద, అన్నపూర్ణ, అలీబేగ్, ఎస్‌ఐలు సత్యనారాయణ, హరికృష్ణ, హెచ్‌సీలు, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లాకేంద్రంలో సాయినగర్‌లోని యాపిల్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తిలు హాజరై ప్రసంగిస్తారన్నారు.



మహాసభల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కలకలం

- సెంట్రల్ వర్సిటీ హాస్టల్ వద్ద తచ్చాడిన దుండగులు
- విద్యార్థినుల కేకలతో పరారైన వైనం
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు
- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ వసతిగృహంలో అమ్మాయిల భద్రతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం 40 మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది పహారా ఉన్న లేడీస్ హాస్టల్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు తచ్చాడినట్లు సమాచారం. అప్రమత్తమైన ఓ విద్యార్థిని గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పరారైనట్లు సమాచారం. తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటన ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం. విద్యార్థినులు వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించా రు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లేలోపు ఆ దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది.

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో 900పైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. ఇందులో 400 మందికిపైగా లేడీస్ హాస్టల్లో ఉంటున్నారు. వర్సిటీలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం బిహార్ నుంచి కూలీలు వచ్చారు. వారు క్యాంపస్ లోనే తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. అయితే ఆదివారం రాత్రి పొద్దుపోయాక హాస్టల్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు తచ్చాడటంతో ఓ విద్యార్థి గమనించి గట్టిగా కేకలు వేసినట్లు తెలిసింది. విద్యార్థుల సమాచారంతో పోలీసులు క్యాంపస్‌లోకి వచ్చేసరికి దుండగలు పరారీ అయినట్లు సమాచారం. దీనిపై పోలీసు బ్లూ క్లోట్స్ పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు కరుణాకర్, కౌలుట్లయ్య, ఇటుకలపల్లి సీఐ హేమంత్ పోలీసు సిబ్బంది సంఘటనకు స్థలానికి చేరుకున్నారు. నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. అనంతరం సోమవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి డాగ్ స్క్వాడ్‌ను ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆరోపణలు వ్యాపించడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ వర్సిటీని సందర్శించారు.



సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన లేడీస్ హాస్టల్

ఆరోపణలే..

అనంతపురం సెంట్రల్ వర్సిటీ బాలికల వసతి గృహం ప్రాంగణంలో పురుషులు తచ్చాడారనే ఆరోపణల్లో వాస్తవంలేదు. భవనం ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆరోపణలపై సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఎక్కడా అలాంటి దృశ్యాలు కనిపించలేదు. పోలీసు బృందం కూడా ఫుటేజ్‌లను పరిశీలించింది. ఇలాంటి దుశ్చర్యలకు చోటులేకుండా వర్సిటీలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు అమర్చాము. 24 గంటలు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వర్సిటీలోకి వచ్చేపోయే ప్రతిఒక్కరి వివరాలు నమోదు అవుతున్నాయి.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరీ, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ

● ఎగసిపడ్డ గంగమ్మ







చందనలో బోరుబావి వేస్తున్న సమయంలో ఉప్పొంగిన గంగ

యాడికి మండలం చందన సమీపంలోని ఓ పొలంలో బోరు వేస్తుండగా.. పక్కనే ఉన్న మరో బోరు నుంచి భూగర్భ జలం రాకెట్ వేగంతో పైకి దూసుకొచ్చింది. సుమారు యాభై అరభై అడుగుల ఎత్తు ఎగసిపడింది. ఆ ప్రదేశంలో.. కేవలం ఎకరం విస్తీర్ణంలో 80కి పైగా వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. సాగునీరు అవసరమైన రైతులు అక్కడ కాస్త స్థలం కొని.. బోరుబావులు వేయించుకుంటున్నారు. అక్కడి నుంచి తమ పొలాలకు పైప్‌లైన్ వేసుకున్నారు. చందనకు చెందిన నలుగురు రైతులు ఉమ్మడిగా సోమవారం ఒక బోరుబావిని తవ్వించారు. తవ్వకం జరుగుతున్న సమయంలో పక్కనే మూతవేసి ఉన్న బోరుబావి నుంచి ఒక్కసారిగా నీరు ఎగసిపడింది. బోరువేసే క్రమంలో ఒత్తిడి కారణంగా ఇలా జరిగినట్లు భావిస్తున్నారు. కొత్త బోరు తవ్వకం పూర్తయిన కాసేపటికి నీరు ఎగసిపడటం ఆగిపోయింది.

- ఆంధ్రజ్యోతి, యాడికి

మీ మేలు మరువలేనయ్యా..!

కలెక్టర్‌కు వృద్ధురాలి కృతజ్ఞత



కలెక్టర్‌కు కృతజ్ఞత తెలుపుతున్న రామాంజినమ్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సక్రమంగా పనిచేస్తే.. బాధితులు అధికారులను ఎంతగా గౌరవిస్తారో తెలిపే ఘటన ఇది. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన రామాంజినమ్మ అనే వృద్ధురాలు 'మీ మేలు మరువలేనయ్యా..' అంటూ కలెక్టర్‌కు రెండు చేతులెత్తి నమస్కరించారు. ఏళ్ల తరబడి ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుని, కంటతడి పెట్టుకున్నారు. రామాంజినమ్మ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం గేటువద్ద నివాసం ఉన్నారు. ఆమెకు గుంతకల్లులోని సర్వే నంబరు348-సీలో 35 సెంట్ల స్థలం ఉంది. కొన్నేళ్ల క్రితం కొన్న ఆ స్థలం డబుల్ రిజిస్ట్రేషన్ అయింది. అధికారులను ఎన్నిసార్లు కలిసినా న్యాయం జరగలేదు. ఈ నేపథ్యంలో గత నెలలో గుంతకల్లులో కలెక్టర్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. రామాంజినమ్మ అక్కడే కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి, తమ సమస్యను వివరించారు. స్థలం అమ్మిన వ్యక్తిని పిలిపించి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆమె స్థలం ఆమెకు దక్కేలా చేశారు. దీంతో రామాంజినమ్మ తన కుమారుడితో కలిసి వచ్చి కలెక్టర్‌కు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ అదే శాలువాతో ఆమెను సత్కరించారు.

మనసున్న మారాజులు

ఆకలి తీర్చుతున్న దాతృత్వం

విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం

ధర్మవరం బాలికల కళాశాలలో 13 ఏళ్లుగా నిర్వహణ

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం ఆకలితో అలమటించే విద్యార్థినులకు అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ధర్మవరం పట్టణానికి చెందిన కొందరు దాతలు. గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థినులు మధ్యాహ్నం పూట మంచి నీళ్లు తాగి కడుపు నింపుకునే వాళ్లు. ఈ విషయాన్ని గమనించిన దాతలు రోజూ మధ్యాహ్నం వారికి అన్నదానం చేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 450 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తారు. ఉదయాన్నే కళాశాలకు రావాల్సి ఉండడంతో ఆ సమయానికి ఇళ్లలో భోజనం సిద్ధంకాదు. దీంతో మధ్యాహ్నం భోజనం లేక అలమటించేవారు. దీనిని గమనించిన కళాశాల కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, అప్పటి ప్రిన్సిపాల్ నాగలింగం భోజన అమలుకు శ్రీకారం చుట్టారు. బండి వేణుగోపాల్ తన స్నేహితుడైన చట్టా వెంకటనారాయణను సంప్రదించి విద్యార్థినుల పరిస్థితి వివరించారు. తన వంతు సాయం అందిస్తానని ఆయన ముందుకు వచ్చారు. దీంతో 2012లో మధ్యాహ్న భోజన పథకాన్ని 108 మంది విద్యార్థినులతో ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ పథకం దాతల సహకారంతో కొనసాగుతూనే ఉంది. 2013లో 158 మంది, 2014లో 180మంది, 2015లో 200 మంది, 2016, 2017, 2018 సంవత్సరాల్లో 300-350, ఈ ఏడాది 450 మంది విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న దాత, కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్

రుణపడి ఉంటాం..



కళాశాలలో మధ్యాహ్న భోజనం పెడుతుండడంతో ఆకలి తీరుతోంది. ఇంటి నుంచి కళాశాలకు వచ్చే మాకు ఉచితంగా భోజనం అందించడం వల్ల చదువుపై మరింత దృష్టి సారిస్తున్నాం. కళాశాలలో సాయంత్రం వరకు ఉండి చదువుకుంటున్నాం. ఇందుకు సహకరించిన దాతలకు రుణపడి ఉంటాం.

-మహేశ్వరి, కనుముక్కల

ఎంతో మేలు..



చదువుకునేందుకు గ్రామాల నుంచి వస్తున్నాం. కళాశాలలో భోజనం పెట్టడం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాణ్యమైన భోజనం పెడుతున్నారు. ఆకు కూరలతో చేసిన కూరలను వడ్డిస్తున్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం కడుపు నింపుతోంది.

-పూజిత, చిన్నూరు, బత్తలపల్లి

సంతృప్తినిస్తోంది..



విద్యార్థినులకు భోజనం అందించడం నాకెంతో సంతృప్తిగా ఉంది. నేను 2012లో మధ్యాహ్న సమయంలో కళాశాలకు వచ్చినప్పుడు విద్యార్థినులు ఇళ్లకు వెళ్లడం గమనించాను. మరికొందరు నీళ్లతాగి కడుపునింపుకోవడం పరిశీలించాను. దీంతో మా మిత్రుల సహకారంతో ఉచిత భోజనం అందించేందుకు సిద్ధపడ్డాను. ఎందరో దాతల సహకారంతో విద్యార్థినులకు భోజనం అందిస్తున్నాం.

- బండి వేణుగోపాల్, కళాశాల చైర్మన్, దాత

పులిపిరికి అరుదైన చికిత్స



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

8 ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

అనంతపురం జిల్లా, డిసెంబరు 9: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలానగర్, ఈఇఖిఅరోడ్, అనంతపురంనందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధశ రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

స్టోర్ డీలర్ ఆత్మహత్యాయత్నం

టీడీపీ నాయకులు కుటుంబంలో చిచ్చుపెట్టారని ఆరోపణ

తన భూమిని అమ్మనివ్వడంలేదని ఆవేదన.. మంత్రి సవితకు సెల్ఫీ వీడియో సందేశం



వీల్‌చైర్‌లో శ్రీధర్

గోరంట్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇద్దరు టీడీపీ నాయకులు తన తండ్రికి లేనిపోనివి చెప్పి భూవివాదాన్ని సృష్టించారని ఆరోపిస్తూ ఓ స్టోర్‌డీలర్ ఆత్మహత్యకు యత్నించాడు. తాను చనిపోతున్నాననీ, తన బిడ్డలకు ఆస్తి దక్కేలా చూడాలని మంత్రి సవితను కోరుతూ సెల్ఫీ వీడియో తీసుకుని, పురుగుల మందు తాగాడు. బాధితుడి పరిస్థితి విషమంగా మారడంతో బెంగళూరుకు తరలించారు. మండలంలోని మల్లాపల్లికి చెందిన శ్రీధర్.. సోమవారం పురుగుల మందు తాగాడు. నాలుగెకరాల పొలంపై తనకు అన్ని హక్కులు ఉన్నా.. సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని సెల్ఫీ వీడియోలో శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే పొలాన్ని రూ.2.36 కోట్లకు విక్రయించి అగ్రిమెంటు చేసుకున్నాననీ, రూ.80 లక్షలు అడ్వాన్సు చెల్లించారని తెలిపాడు. మరో రూ.1.56 కోట్లు అందాల్సి ఉండగా, స్థానిక టీడీపీ నాయకులు ఇద్దరు తన తండ్రి దశరథరామప్పకు తనపై లేనిపోనివి చెప్పారనీ, తనకు వివాహేతర సంబంధం అంటగట్టారని వాపోయాడు. తన తండ్రి మనసు మార్చి, తన భూమి రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు బతకాలని లేదనీ, తాను చనిపోయాక రూ.1.56 కోట్ల మొత్తాన్ని తన కుమారుడు బాలాజీకి చెందేలా చూడాలని మీడియాను అభ్యర్థించాడు. రాజకీయ స్వార్థంతో తన తండ్రి బుద్ధిపాడుచేసి, తన భూమిని టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, మహమ్మద్ కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 'సవితమ్మ అక్కా.. మీ పేరు చెప్పుకుని అమాయకులను మోసం చేస్తున్నారు. ఇలాంటివారిని దూరం పెడితే పార్టీకి మంచి పేరు వస్తుంది. నేను టీడీపీకోసం ఎంతో చేశా. దయచేసి నన్ను క్షమించండి' అని మంత్రి సవితకు విన్నవించాడు. ఆ తరువాత మల్లాపల్లిలోని తన నివాసంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం, అక్కడి నుంచి బెంగళూరు తరలించారు.

విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు..

శ్రీధర్ సెల్ఫీ వీడియో, ఆత్మహత్యాయత్నంపై గోరంట్ల సీఐ శేఖర్ స్పందించారు. శ్రీధర్‌కు చెందిన నాలుగెకరాల పొలాన్ని తాకట్టుపెట్టి, విచ్చలవిడిగా ఖర్చు చేశాడన్నారు. దీంతో తండ్రి దశరథరామప్ప మనవళ్లకు ఫీజులు కడుతూ చదివిస్తున్నారనీ, తాకట్టు పెట్టిన భూమిని విడిపించి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మరొకరికి అగ్రిమెంటు చేయించాలని శ్రీధర్ బోగస్ పత్రాలు సృష్టించడంతో న్యాయం కోసం కొన్నిరోజులుగా దశరథరామప్ప పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడని తెలిపారు.

పోలీస్ స్టేషన్ నుంచి పరారీ

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి దొంగతనం కేసు నిందితులు ఇద్దరు పరారయ్యారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గం, అనంతపురం నగర శివారులోని పలు ఆలయాలు, ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దీంతోపాటు బైక్‌ల దొంతనాలు జరిగాయి. ఈ కేసులలో ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నిమిత్తం ఇటీవల నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. అదే రోజు తెల్లవారుజామున, పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్న సమయంలో షేక్ మహబూబ్ బాషా, గుజ్జల అశోక్ పరారయ్యారు. చోరీ సొత్తు రికవరీ కోసం ప్రయత్నిస్తున్న పోలీసులకు ఇద్దరి పరారీతో షాక్ తగిలింది. ఈ వ్యవహారంపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. పారిపోయినవారిలో ఒకరిని పట్టుకున్నామని చెబుతున్నా.. స్పష్టత రాలేదని తెలిసింది.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.37 వేలు



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 37,280 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 74 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆరుగురిపై పిచ్చికుక్క దాడి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతమసీదువీధి, పాత పోస్టాఫీసు వీధిలో సోమవారం పిచ్చికుక్క ఆరుగురిపై దాడి చేసి గాయపర్చింది. వారిలో వై. గంగాద్రి, తుమ్మల ఫాతిమా, నాగరాజు, నారాయణ, నాగేంద్ర తదితరులు ఉన్నారు. వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. గ్రామస్థులు ఏకమై ఆ పిచ్చికుక్కను చంపివేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంలో పందులు, కుక్కలు భారీగా ఉన్నాయని, వాటిని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీవీ నగర్‌లో నివాసం ఉంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సత్యనారాయణ ఇంటికి తాళాలు వేసి నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని కుమారుల వద్దకు వెళ్లారు. దీనిని గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలి చొరబడి, 30 తులాలు వెండి వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. బీరువాలోని బట్టలను చెల్లా చెదురుగా పడేసి వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించిన స్థానికులు బాధిత కుటుంబానికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి చెందిన శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్ఎస్ స్-2కు 895 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

చేద్దామా.. వద్దా..?

పనులు చేస్తే బిల్లులు వస్తాయో.. రావో..

గత అనుభవాలతో తటపటాయిస్తున్న కాంట్రాక్టర్లు

పనులు చేయడానికి ముందుకురాని వైనం

రెండు నెలలైనా 10శాతం పనులే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

అనంతపురం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాపాలు నేడు శాపాలుగా మారాయి. వైసీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు నేడు టెండర్ పిలిచినా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్లను కూటమి ప్రభుత్వం బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే ఉమ్మడి జిల్లాలో రోడ్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు కోసం ఈ ఏడాది సెప్టెంబరులో రూ.44.29 కోట్లను మంజూరు చేసింది. అయితే రెండు నెలలు గడిచినా కనీసం 10శాతం పనులు కూడా జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం గత ప్రభుత్వం మాదిరే ఇప్పుడు కూడా పనులు చేస్తే బిల్లులు రావేమోననే భయంతో కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 150 కోట్లు బిల్లులను గత సర్కార్ పెండింగ్ పెట్టినట్లు తెలిసింది.



ధర్మవరం డివిజన్‌లో రోడ్డు మరమ్మతు పనులు





తాడిపత్రి నుంచి బుక్కాపురం వెళ్లే రహదారి.. మరమ్మతులకు ముందు.. మరమ్మతుల తరువాత..

● వైసీపీ హయాంలో ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్..

ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆర్‌అండ్‌బీలోని స్టేట్ హైవేలు, మేజర్ డిస్ట్రిక్ రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. అరకొరగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ. 150 కోట్లు బిల్లులు పెండింగ్‌లోనే పెట్టినట్లు సమాచారం. ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అందుకే కూటమి సర్కార్ నిధులు మంజూరు చేసినా పనులు చేయడానికి ముందుకురాని దుస్థితి.

● ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

● అనంతపురం జిల్లాలో...

- రోడ్ల పనుల సంఖ్య : 134
- కిలోమీటర్లు : 1939.12
- వెచ్చించిన నిధులు: రూ. 27.76 కోట్లు

● శ్రీ సత్యసాయి జిల్లాలో..

- రోడ్ల పనుల సంఖ్య : 119
- కిలోమీటర్లు : 1499.24
- వెచ్చించిన నిధులు: రూ.16.53 కోట్లు



కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో..

రెండు నెలలైనా 10శాతం మాత్రమే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.44.29 కోట్లతో 253 పనులు చేయనున్నారు. ఇందులో భాగంగా 3438.36 కిలోమీటర్ల చొప్పున రోడ్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు పనులు చేసేందుకు కూటమి సర్కార్ ఈ ఏడాది సెప్టెంబరులో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ గత సర్కార్ బిల్లులు చెల్లింపు ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వంలో కూడా కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేయడం లేదు. చాలా మంది టెండర్లు దాఖలు చేశారు, కానీ.. పనులు చేయడంపై శ్రద్ధ వహించడం లేదు. కొందరు మాత్రం ధైర్యంగా చకచక పనులు చేశారు. గత రెండు నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10శాతం మాత్రమే పనులు చేసినట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఈ రెండు నెలల్లో చేసిన 10 శాతం పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తే వెంటనే మిగిలిన కాంట్రాక్టర్లు పనులు చేయాలనే యోచనలో ఉన్నట్లు ఆ వర్గాల నుంచి తెలిసింది.





● నెమ్మదిగా సాగుతున్న మాట వాస్తవమే

చాలా మంది కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాలేదు. దీంతో చాలామంది పనులు చేయాలంటే భయపడుతున్నారు. పనులు కూడా నెమ్మదిగానే సాగుతున్నాయి. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుత పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయని చెప్పి ఎక్కడికక్కడ అప్రమత్తం చేస్తున్నాం. దీంతో కొన్ని చోట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. భవిష్యత్‌లో వేగవంతంగా జరిగే విధంగా చూస్తాం.

-హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఎస్ఈ

బాలిక అదృశ్యం

దర్యాప్తులో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ తల్లి ఆత్మహత్యాయత్నం

పోలీసు స్టేషన్ ముందు బంధువుల ఆందోళన

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న తండ్రి



బాధితులకు సర్దిచెబుతున్న సీఐ

మడకశిర టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధి బేగార్లపల్లికి చెందిన బాలిక కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆవేదనతో తల్లి శైలజ సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. ఇంట్లోనే ఆమె విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాలిక బంధువులు స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో బాలిక తండ్రి జయరామప్ప ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకుని, సర్దిచెప్పారు. బాలిక ఆచూకీ త్వరలోనే గుర్తిస్తామని సీఐ రాజ్‌కుమార్ హామీ ఇవ్వడంతో వారు శాంతించి, వెళ్లిపోయారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్టు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ సురేష్ తెలిపారు. మండలంలోని బత్తలపల్లికి చెదిన ఈడిగ సూర్యనారాయణ మూడు రోజుల క్రితం ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించారు. సోమవారం మధ్యాహ్నం బత్తలపల్లి మారెమ్మ దేవాలయం సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇందులో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ సురేష్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ రహంతుల్లా, కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, రాందాస్‌నాయక్, భర ద్వాజ్‌రెడ్డిని అభినందించి, రివార్డులను అందచేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

న్యూస్ బాక్స్..

నేడు రెవెన్యూ సదస్సులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఉదయం 11 గంటలకు రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నామని, రైతులు వారివారి సమస్యలను ఇందులో పరిష్కరించుకోవాలని సూచించారు.

● నల్లమాడ : మండలంలోని వేళ్లమద్దిలో మంగళవారం రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సమస్యలున్న రైతులు వినతిపత్రాలు అందించాలని, ఆ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఐగా ఇసాక్ బాషా



గాండ్లపెంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల ఎస్ఐగా ఇసాక్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముదిగుబ్బ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడి ఎస్ఐ వరలక్ష్మీ బదిలీపై తాడిమర్రికి వెళ్లారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దేవేంద్ర



నంబులపూలకుంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ నరేంద్ర కుమార్ దీర్ఘకలిక సెలువుల్లో వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేంద్రనాయక్‌ను ఇన్‌ఛార్జీ తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆయన ఆ బాధ్యతలు స్వీకరించారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

బత్తలపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ప్రభాకర్ హెచ్చరించారు. మండలంలోని వెంకటగారిపల్లిలో ఇటీవల కాలంలో పలు గొడవలు జరిగాయి. దీంతో సీఐ, ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో ఆ గ్రామంలో పర్యటించారు. గొడవలు పడి వారిని పిలిచి కారణాలపై ఆరా తీశారు. రస్తా వివాదాలను రెవెన్యు అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని సూచించారు. అలాకాకుండా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ధర్మవరం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రేగాటిపల్లి రోడ్డు పక్కన గల వివేకానంద డిగ్రీ కళాశాలలో సోమవారం సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ హర్షవర్దన్, ఏఓ రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సత్యసాయి బాబా భక్తుడు రాంప్రసాద్ సోమవారం విద్యా సామగ్రిని పంపిణీచేశారు. 50 మంది విద్యార్థులకు రూ.7వేలు విలువ చేసే పలకలు, రైటింగ్ ప్యాడ్స్, నోట్ పుస్తకాలు, పెన్సిల్, పెన్నుల తదితర వాటిని అందించామన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా చాకలి రాధమ్మ



కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య అధ్యక్షురాలిగా చాకలి రాధమ్మను 27 మహిళాసంఘాల సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమె ఎన్నికకు మూడు నెలలుగా పలువురు అడ్డుపడుతూ వచ్చారు. అయితే ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి రాధమ్మను ఏకగ్రీవంగా ఎంపిక చేయాలని టీడీపీ నాయకులు, అధికారులకు సూచించడంతో ఆమెను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఆమె ఎంపికను ఒక మహిళ అడ్డుకోవడానికి బ్యాంకు, ఐకేపీ కార్యాలయం వద్ద హల్‌చల్ చేసింది. ఆమెను, ఇతర మహిళలను సీఐ ఇందిర స్టేషన్‌కు పిలిపించి, మందలించారు.

సీతారాముల ఊరేగింపు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు గ్రామంలో ఆదివారం రాత్రి సీతారాములను భక్తిశ్రద్ధలో ఊరేగించారు. రాములవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని గతనెల 27న నిర్వహించారు. 40రోజులు అయిన సందర్భంగా మండల పూజ, భారీగా ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సొంతస్థలం ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి సూచించారు. సోమవారం బుక్కపట్నంలోని తేరు సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతాతో గృహనిర్మాణశాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గోపాలపురం గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిభావంతుల దినోత్సవం

నల్లచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వేమనస్వామి ఆలయం వద్ద వినాయక మండల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఎస్ఐ మగ్బుల్‌బాషా, ఏపీఎం రమణప్ప, మండల సమాఖ్య సభ్యులు పర్వతరెడ్డి, రెడ్డెప్ప, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ధర్మవరం/ఓబుళదేవరచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలో మైనార్టీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహమ్మద్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సోమవారం ధర్మవరం మైనార్టీలు ఆయన్ను సన్మానించారు. ఇందులో ధర్మవరానికి చెందిన జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షుడు అత్తర్‌రహీంబాషా, ఆఫీసఫ్, ఉమర్‌ఫరూక్, మహబూబ్‌బాషా, ఇమాములు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే పార్లమెంటు రైతు సోషియల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆర్‌ఎంపీ జాకీర్ అహమ్మద్, మైనార్టీ నియోజకవర్గ కార్యదర్శి గండికోట ఇర్షాద్, ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పొగాకు షానవాజ్, రైతు సంఘం అధికార ప్రతినిధి రెడ్డెప్ప అతన్ని సన్మానించారు.

తుప్పుపడుతున్న వాహనాలు..!

ధర్మవరంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధర్మవరంరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ రకాల కేసుల్లో స్వాధీనం చేసుకున్న పలు వాహనాలు ఎండకు ఎండి.. వానకు తడిసి తుప్పుపడుతున్నాయి. ఈ స్టేషన్‌లో సుమారు 100కు పైగా వాహనాలున్నాయి. వాటిని వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, వాహనాలు వినియోగంలోకి వస్తాయని స్థానికులు కోరుతున్నారు.



రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో తుప్పుపడుతున్న ద్విచక్రవాహనాలు

కట్టడి ఏదీ..?

● యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం ● జిల్లాలో అమలుకాని నిషేధం



పుట్టపర్తి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ భూతాన్ని కట్టడి చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారు. నిషేధిక ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ప్రభుత్వం కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. దాన్ని కఠినంగా అమలు చేయడంలో అధికా రులు, పాలకులు విఫలం అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీలో మాత్రమే ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. ఇక మరే చోట ప్లాస్టిక్ నిషేధంపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్లాస్టిక్ కవర్లలోని వస్తువులు తినడం, తాగడం వల్ల ప్రజలు అనేక రోగాలకు గురవుతున్నారు. ఇక ఆ కవర్లను తిన్నపశువులు మృత్యువాత పడుతున్నాయి.



పాలిథిన్ కవర్‌లో కూరగాయలు తీసుకుంటున్న వినియోగదారుడు

వీటిపై నిషేధం

- 75 మైక్రాన్లు కంటే ఎక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను మాత్రమే వినియోగించాలి
- నార, కాగితం, క్లాత్‌తో చేసిన సంచులను వాడాలి. అతన్ని దుకాణాల్లో వీటిని అందుబాటులో ఉంచాలి
- పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను అనుమతించరాదు
- ప్రతి పర్యాటక ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం బోర్డులు ఏర్పాటు చేయాలి
- ఈ నిబంధనలు పాటించని వర్తకులు, వినియోగదారుల నుంచి అపరాధరుసుం వసూలు చేయాలి

● ప్రకటనకే పరిమితం

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలోనూ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయడం లేదు. అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారు. ఎప్పుడో ఒకసారి ఆర్భాటం చేయటం తర్వాత.. దాన్ని గురించి పట్టించుకున్న ఊసే సలేదు. పట్టణంలో ఎక్కడచూసినా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. కిరాణా దుకాణాలు, కూరగాయల దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగం మరీ ఎక్కువగా కనిపి స్తోంది. అలాగే హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లు కూడా అధికంగా వాడుతున్నారు. దీంతో పంటపొలాలు, చెరువులు, నదులు, వంకలు, వాగులు, ఎక్కడచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా దర్శనమిస్తున్నాయి. ఇక ఎక్కడైనా శుభ, అశుభ కార్యక్రమాలు జరిగినా... భారీ స్థాయిలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వినియోగించి పడేస్తున్నారు.

గ్రామాల్లో అధికంగా వాడకం



జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో ప్లాస్టిక్ నియంత్రణ అమలు చేస్తున్నాం. గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ నియంత్రణకు విధివిదానాలు రూపొందిస్తున్నాం. అక్కడి కూడా కట్టడి చేస్తాం.

- సమత, జిల్లా పంచాయతీ అధికారి

విద్యుత్ అక్రమ కనెక్షన్ల తొలగింపు



విద్యుత్ అక్రమ కనెక్షన్లు తొలగిస్తున్న అధికారులు

తాడిమర్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి చెరువును ఆక్రమించుకుని 30దాకా బోర్లు వేశారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవడంతోపాటు చెరువు భూములను కూడా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువు కింద ఉన్న అసలైన సాగుదారులకు నీరు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బాధిత రైతులు గతనెల 4న పుట్టపర్తిలోని నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా ఇంతవరకూ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో రైతు గోడుపట్టని అధికారులు.. కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్ అనే పేరుతో ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి అధికారులు స్పందించారు. మండల సర్వేయర్లు సుశాంతి, హేమలత, వీఆర్‌ఓలు కుళ్లాయప్ప, ఓబుళేశు, విద్యుత్‌శాఖ ఎల్ఐ నాగరాజు, లైన్‌మెన్ హరి ఆ అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. తాడిమర్రి పడమటి చెరువుకు చేరుకున్న అధికారులు 15 విద్యుత్ కనెక్షన్‌లను తొలగించారు. ఇక మిగిలింది రెవెన్యూ శాఖ అధికారుల పనే. వారు చెరువును కొలతలు వేసి సరిహద్దులను నిర్ధారించాల్సి ఉంది. చెరువు ఆక్రమణ దారులకు నోటీసులు అందించి వారిని చెరువులో పంటలు సాగుచేయకుండా నిరోధించాల్సి ఉంది.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అదానీ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అదానీ గ్రూప్ కంపెనీల అవినీతిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు వేమయ్య యాదవ్ డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక గణేష్‌కూడలిలో నిరసన వ్యక్తంచేశారు. అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి తప్పిదాలపై, కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, అందుకోసం సంయుక్తపార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని డిమాండుచేశారు. అలాగే సాయుధ బలగాల ప్రత్యేక రక్షణచట్టం ఉపసంహరిం చుకోవాలన్నారు. అధిక ధరలు అరికట్టాలని నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండు చేశారు. అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో అదానీపై అవినీతికేసు నమోదైందని, విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ నాలుగు రాష్ట్రాలో దాదాపు రూ 2100 కోట్ల ముడుపులు ఇచ్చినట్లు ఆరోపణ లున్నాయని అన్నారు. అధిక భాగం రూ 1700 కోట్లు ఆంధ్రప్రదేశ్‌లోనే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ముడుపులుగా ముట్టచెప్పినట్లు తెలుస్తోందన్నారు. ఫలితంగా 25 సంవత్సరాలపాటు రాష్ట్రప్రజలపై రూ.1.10 కోట్లమేర విద్యుత్ చార్జీల భారం పడుతోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అదానీ అవినీతిపై సమగ్రవిచారణ జరపాలని, గత ప్రభు త్వం అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండు చేశారు. కేంద్రప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం అదానీని అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయలక్ష్మి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సంబరాలు



కదిరిలో యూటీఎఫ్ నాయకుల సంబరాలు

కదిరి అర్బన్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోర్రా గోపీమూర్తి విజయం సాధించడంపై సోమవారం యుటీఎఫ్ నాయకులు కదిరిలో సంబరాలు జరిపారు. కాలేజీ సర్కిల్‌లో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహీర్‌వలీ, వైవీ సుబ్బారెడ్డి, నాయకులు మల్లికార్జున, ఆజాంబాషా, సునిల్‌కుమార్, నాగరాజు, ఖాదర్‌బాషా., ఖజా, రమణనాయక్, రవివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గాండ్లపెంట మండలం చిన్నమిట్ట వద్ద నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి వైసీపీ నాయకుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.లక్ష విరాళం అందచేశారు. సోమవారం కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఆయన నివాసంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆ చెక్కును అందచేశారు.


ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్ప మాలాధారులు

నంబులపూలకుంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయ నిర్మాణం ప్రాంతం నుంచి ఈ గ్రామోత్సవాన్ని ప్రధాన రహదారి, పురవీధుల్లో నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయ్యప్పస్వామి, కుమరస్వామి చిత్రాపటాలను ఊరేగించారు. కార్యక్రమంలో గురుస్వామి రఘునాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రతిభావంత విద్యార్థులతో ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో 90 శాతానిపై పైగా మార్కులు సాధించిన పోలీసు కుటుంబాలకు చెందిన 50 మంది విద్యార్థులకు ఎస్పీ వీ రత్న ప్రశంసాపత్రాలు అందజేశారు. 50 మంది విద్యార్థులకు రూ.3,40,500 చెక్కులను అందచేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. ఇష్టపడి చదివి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అర్జ శ్రీనివాసులు, ఏఓ సుజాత, రాష్ట్రపోలీసు అధికారులు సంఘం సభ్యులు సూర్యకుమార్, ఆర్ఐలు మహేష్, వలి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలి

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలని వైసీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు ఆర్డీఓ కార్యాలయ డీఏఓ కతిజ్‌ఖుబ్రాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీల వివాహ శుభకార్యాలయాలకు అనేక కార్యక్రమాల కోసం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, దేవరకొండ రమేశ్, కుణుతూరు గోపాల్, బొమ్మన్న, సాకే వెంకటేశ్, రామాంజినేయులు, మల్లెల పెద్దన్న, కుళ్లాయప్ప ఉన్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సోమవారం ఇన్‌చార్జీ తహసీల్దార్ దేవేంద్రనాయక్ హిందూపురం ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెకటరీ రెడ్డెప్ప వినతిపత్రం అందించారు. ఎస్సీ కాలనీలో ఇళ్లులేని నిరుపేదలు 125 మందికి ఆర్డీటీ సంస్థ ఇళ్లు కట్టించడానికి ముందుకొచ్చారని, వారికి స్థలం చూపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మౌలాసాబ్, రవి. తదితరులున్నారు.

ధర్మవరంరూరల్: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందించారు.

'గ్రీవెన్స్ డే'లో పలు ఫిర్యాదులు

ముదిగుబ్బ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాలో గ్రీవెన్స్‌డేను సోమవారం నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణయాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కోట్లబాబీ, గ్రామ సర్పంచ్ కుళ్లాయప్పనాయక్, ఎంపీటీసీ తిరుమాలమ్మబాయ్, భాస్కర్‌నాయక్, మహేశ్‌నాయక్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ....

జలాశయంలో మృతదేహం లభ్యం



తేలియాడుతున్న మృతదేహం

నంబులపూలకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పెడబల్లి జలాశ యంలో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతూ ఉండగా.. పశువుల కాపర్లు గమనించి.. పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ వలీబాషా సిబ్బందితో వెళ్లి.. ఆ మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు గాండ్లపెంట మండలం కురమామిడి పంచాయతీలోని గుట్టకిందపల్లికి చెందిన లక్ష్మీరెడ్డి(50)గా గుర్తించారు. అతనికి మతిస్థిమితం లేదని, ఇంకా పెళ్లి కాలేదని పోలీసులు తెలిపారు. వీఆర్‌ఓ రఘు పంచనామా చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం ఓప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను నాగరాజు అలియాజ్ రాజు అనే ఆటోడ్రైవర్ ఆరు నెలల క్రితం ప్రేమ పేరుతో మోసంచేశాడు. శరీరంగా లోబరుచుకున్నాడు. గత నెల 30న కదిరి పోలీస్ స్టేషన్‌లో ఆ బాలిక నానమ్మ దీనిపై ఫిర్యాదు చేసింది. సోమవారం రూరల్ పరిధిలోని ఎర్రదొడ్డి టోల్‌గేట్ వద్ద నిందితుడ్ని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆటో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టు ముందు హాజరుపరచగా.. 14రోజులు రిమాండ్ విధించడంతో అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

నకిలీ వన్‌బీ కేసులో అరెస్టు

తనకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో సంచలనం రేకెత్తించిన నకిలి వన్‌బీ కేసులో మండ లానికి చెందిన వైసీపీ నాయకులు ముగ్గురు అరెస్టు అయిన విషయం విదితమే. ఈ కేసులో మధ్యవర్తులుగా ఉండి భూమి రిజిస్ట్రేషన్‌లో సాక్షి సంతకాలు చేసిన నాగిరెడ్డిపల్లికి చెందిన సుబ్రమణ్యం, కిరణ్‌ను సోమవారం కదిరిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కదిరిలీగల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈగల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల పేరుతో తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయడం, అనంతపురం నుంచి ఎన్‌డీపీఎస్ కేసులను అక్కడికి బదిలీ చేయడాన్ని స్థానిక న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈనెల 9నుంచి 13 వరకు విధుల నిరవధిక బహిష్కరణ చేపట్టారు. అందులో భాగంగా సోమవారం విధులను బహిష్కరించిన స్థానిక న్యాయవాదులు వారి సంఘ కార్యాలయంలో సమావేశమయ్యారు. అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ కేసుల విచారణకు జిల్లా కేంద్రమైన అనంతపురంలో ఏడీజే కోర్టు స్థాయి కోర్టు నందు విచారణ చేయడం వల్ల ప్రజలకు చాలా అందుబాటులో ఉండేన్నారు. ఈ ప్రాంత వాసులు తిరుపతికి వెళ్లాలంటే చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. 30 సంవత్సరాలుగా అనంతలో ఎన్‌డీపీఎస్ కేసులను విచారిస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో ప్రత్యేక ఈగల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడానికి న్యాయవాదులు ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే అందుబాటులో ఉన్న దానిని ప్రజలకు దూరం చేయడం తగదని అన్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు సురేంద్ర, రమేష్, నాగేశయ్య, రవీంద్రబాబు, భైరవప్రసాద్, దశరథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి

రోడ్డు పనులకు శ్రీకారం

గాండ్లపెంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూపల్లి పంచాయతీ మునగలవారిపల్లి క్వాటర్సులో రూ.9 లక్షలతో దాదాపు 280 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీ రాజ్ జేఈ రెడ్డి వరప్రసాద్ ఈ పనులను పరిశీలించారు.



సీసీరోడ్డు వేస్తున్న సిబ్బంది

సంక్షిప్తం

మాజీ మంత్రి రామచంద్రారెడ్డికి ఘన నివాళి



తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం కొండంపల్లి సమాధి వద్ద ఆయన కుమార్తె, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, మంత్రి సోదరుడు నాగరాజు పాల్గొన్నారు.

ఆస్తి వివాదం.. అన్నదమ్ముల ఘర్షణ

పరిగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లికి చెందిన అన్నదమ్ములు ప్రభాకర్‌రెడ్డి, గోకుల్‌రెడ్డి ఆస్తుల విషయమై ఆదివారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. అదేరోజు సాయంత్రం ప్రభాకర్‌రెడ్డి, భార్య వసంతలక్ష్మీ పనుల నిమిత్తం హిందూపురం వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా గోపాల్‌రెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, మోదా గేటువద్ద దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన వసంతలక్ష్మీని స్థానికులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

పరిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణానికి చెందిన ఇలియాజ్ కర్ణాటక రాష్ట్రం ఇస్లాపురం వాసి మధు ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాల్లో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు.. ఇలియాజ్ ఫ్లిప్‌కార్ట్ డెలివరిబాయ్‌గా పనిచేస్తూ మండల పరిధిలోని చెర్లోపల్లిలో డెలివరీ ఇచ్చి తిరుగుప్రయాణం చేస్తుండగా మోదా సరిహద్దు ప్రాంతంలో సేవామందిరం వైపు నుంచి వస్తున్న మధు అధిక వేగంతో వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇలియాజ్‌కు కాలువిరగ్గా చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి షేక్ ఇసాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

గుడిబండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబలబండ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.7,150 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారాన్ని తెలుసుకొని సిబ్బందితో వెళ్లి జూదకేంద్రంపై దాడిచేశామని వివరించారు.

ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలి

హిందూపురం అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అజీజియా మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టి, బదిలీలు చేయాలని, విద్యార్థులకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన అరియర్స్, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, నాయకులు రవిశేఖర్, శివన్న, నారాయణస్వామి, మల్లికార్జున, జగన్ పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల అదృశ్యమైన యువకుడు సోమవారం బావిలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొద్దం మండలం నారనాగేపల్లికి చెందిన సంజీవమ్మ కుమారుడు వినోద్‌కుమార్(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. నాలుగు రోజులక్రితం వినోద్‌కుమార్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని తల్లి సంజీవమ్మ రొద్దం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై తేలాడుతుండటంతో గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వినోద్‌కుమార్‌గా గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షం: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, రాష్ట్రాభివృద్ధిలో వేగం పెరగాలన్నా, పేదలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కాంగ్రెస్, వైసీపీకి పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాన్ని క్షేత్రస్థాయి లో అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు భక్తర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పెనుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులు, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. సోమవారం తెల్లవారుజామున సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కృష్ణా, సేవా సమితి సభ్యులు వెంకటేశ్వర్‌రావు, వెంకటేశులు, నిడిమామిడిరెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండు, అంబేద్కర్‌సర్కిల్, దర్గాసర్కిల్, తదితర ప్రాంతాల్లో ఆరుబయట చలిలో నిద్రిస్తున్న యాచకులు, మతిస్థిమితంలేనివారికి, పేదలకు దుప్పట్లు అందించారు.

ఆమిదాలగొందిలో పింఛన్ల తనిఖీ

మడకశిర రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆమిదాలగొంది గ్రామంలో సోమవారం పింఛన్ల సామాజిక తనిఖీలు చేపట్టారు. సచివాలయం-1 పరిధిలో 482 పింఛన్లు ఉన్నాయి. మూడు బృందాలు గ్రామాల్లో పర్యటించి ఇంటింటా తనిఖీ చేపట్టాయి. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య గ్రామంలో పర్యటించి తనిఖీలను పరిశీలించారు.



పింఛన్లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

ట్రాఫిక్ పెను సమస్య

- పాలకులు మారినా అవే కష్టాలు
- ఆక్రమణదారుల నుంచి ముడుపులు
- చేతులెత్తేసిన పోలీసులు
- చోద్యంచూస్తున్న నగర పంచాయతీ

పెనుకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయలు పాలించిన పెనుకొండ పర్యాటక ప్రాంతంగా పేరుగాంచింది. ఇక్కడ ఎన్నో చారిత్రక కట్టడాలున్నాయి. వీటిని తిలకించేందుకు ఇతర రాష్ట్రాలు, జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు వస్తుంటారు. కియా కార్ల పరిశ్రమ, దాని అనుబంధ పరిశ్రమలు రావడంతో అందులో పనిచేసే కార్మికులు దాదాపు 5వేల మందికిపైగా పెనుకొండలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారినా ట్రాఫిక్ సమస్య అదేవిధంగా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రధానమైన అంబేద్కర్, తెలుగుతల్లి, గాంధీ, శ్రీకృష్ణదేవరాయలు, దర్గా సర్కిళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఉన్న రోడ్డును ఆక్రమించి దుకాణాల ముందు భాగంలో సామగ్రి, పబ్లిసిటీ బోర్డులు పెడుతున్నారు. ఆ ముందు భాగంలో ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో 30 అడుగులు ఉన్న రోడ్డు కాస్తా 10 అడుగులు మాత్రమే మిగులుతోంది. ఈ రహదారివైపు వెళ్లే పలు వాహనదారులు ఢీకొని గొడవలు పడిన సందర్భాలు కోకొల్లలు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కట్టడి చేసే క్రమంలో షాపు యజమానులను తమ హద్దులో ఉండాలని ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధులతో పోలీసులకు ఫోన్లు చేయించి అడ్డుకుంటున్నారన్న విమర్శలున్నాయి. దీంతో పోలీసులు చేతులెత్తేస్తున్నారు.



ఆక్రమణలతో ఆటో, కారు వెళ్లలేని 30 అడుగుల రహదారి

ఆక్రమణదారులతో ముడుపులు

గత వైసీపీ పాలనలో ఎస్కేడీ సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని నగర పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు అందించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో దుకాణ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. తొలగించేందుకు కొలతలు వేశారు. ఇదే అదునుగా భావించిన నగర పంచాయతీ ప్రజాప్రతినిధి ఒక్కో షాపు యజమాని నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశారన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. దాదాపు 30 షాపుల యజమానులు గుట్టు చప్పుడు కాకుండా ముట్టజెప్పినట్లు బహిరంగంగా చర్చ జరిగింది. హడావుడి చేసి అక్రమ కట్టడాలను తొలగించలేదని విమర్శలు వచ్చాయి.

పోలీసులతో చర్చించి పరిష్కరిస్తాం

పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం. టౌన్ ప్లానింగ్ రికార్డులు పరిశీలించి సమగ్ర విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఎస్కేడీ సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు ఉండే రోడ్డు వెడల్పు వివరాలను ఆరా తీస్తాం.

\- శ్రీనివాసులు, కమిషనర్, నగర పంచాయతీ

ఆక్రమణలు తొలగించాలి



ఒకరిని చూసి మరొకరు అక్రమ నిర్మాణాలు చేసి ప్రధాన రహదారికి రాకపోకలకు ఇబ్బందులు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్న రోడ్డును ఏర్పాటు చేయాలి. అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టిసారించి సౌకర్యంతంగా రహదారిని ఏర్పాటు చేయాలి. షాపుల ముందు ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించి వారి హద్దుల్లో వ్యాపారాలు చేసుకునే చర్యలు తీసుకోవాలి.

\- నరేంద్రకుమార్, పెనుకొండ

త్వరలోనే క్రమబద్ధీకరిస్తాం



బాబయ్యస్వామి ఉరుసు ఈనెలలోనే పెద్దఎత్తున జరగనుంది. ఉరుసు ముగిసిన అనంతరం ఎస్‌ఐ, నగర పంచాయతీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ఆక్రమణలు తొలగిస్తాం. వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతాం. ట్రాఫిక్ సమస్యలపై పలుమార్లు ఆక్రమణదారులను హెచ్చరించాం. అయినా పద్ధతి మార్చుకోలేదు. అన్నిశాఖల సమన్వయంతో త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

\- రాఘవన్, సీఐ, పెనుకొండ

కొందరి కోసం అందరికీ ఇబ్బందులు



పట్టణంలో ప్రధాన సర్కిల్లో ఉన్న వంద మంది వ్యాపారుల లబ్ధి కోసం ఆ రహదారివైపు నిత్యం వెళ్లే 20వేల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, పలు కార్యాలయాలు, బ్యాంకులు, మార్కెట్, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి దారి ఇది. ఇప్పటికైనా పాలకులు స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలి.

\- ప్రకాశ్, పెనుకొండ

ఇంజనీరింగ్ సిబ్బంది సమ్మె.. పురంలో అంధకారం





సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, వీధిదీపాలు వెలగకపోవడంతో చీకట్లో పురం వీధులు

హిందూపురం/హిందూపురం అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఇంజనీరింగ్ వర్కర్స్ దీక్షలో పాల్గొనడంతో సోమవారం రాత్రి హిందూపురం పట్టణంలోని వీధి దీపాలు వెలగలేదు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వీధి దీపాలు ఆన్ చేయలేదు. పర్మినెంట్ ఉద్యోగులున్న ప్రాంతాల్లో మాత్రమే వీధి దీపాలు వెలిగాయి. దీంతోపాటు వాటర్‌మెన్‌లుకూడా సమ్మెలోకి వెళ్లడంతో కొన్ని ప్రాంతాల్లో సోమవారం నీళ్లను వదలకుండా ఆపేశారు. దీనిపై మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా ఒక యూనియన్‌కు సంబంధించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈనెల 5న సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చారు. కానీ ఆ తరువాత అధికారులకు చెప్పకుండా సోమవారం కార్యాలయం గేటువద్ద నిరసన చేపట్టారు. మంగళవారం నుంచి వారు సమ్మెలో ఉన్నాకానీ నీటి సరఫరాకు, వీధి దీపాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. చాలా వీధుల్లో వీధి లైట్లు వెలుగక చీకటి అలముకుంది. ఇలాగే కొన సాగితే ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

డిమాండ్లు పరిష్కరించండి

తమ సమస్యలను పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ నాయకులు కలీల్, రఘు, కగ్గలప్ప డిమాండ్ చేశారు. రూ.12వేల జీతానికే పని చేస్తున్నామని, ప్రస్తుతం నిత్యావసర ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. టెక్నికల్ వారికి రూ.29,200, నాన్ టెక్నికల్ వారికి రూ. 24,500 జీతం ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, 55 ఆదివారాలు, 17 జాతీయ, దేశ, రాష్ట్ర పండుగలకు సెలవులు ఇవ్వాలని, విధి నిర్వహణలో ఎవరైనా చనిపోతే రూ. పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం జీతాలు పెంచాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామన్నారు.

అవినీతికి పాల్పడితే జైలు తప్పదు: ఎమ్మెల్యే

మడకశిర టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా అవినీతికి పాల్పడితే కూటమి ప్రభుత్వం ఉపేక్షించే ప్రసక్తి లేదని, అ లాంటి వారికి జైలుశిక్ష తప్పదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. సో మవారం డ్వామా కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి నియోజకవర్గం స్థాయి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతిని అరికట్టేందుకు జీవో నెంబర్.52ను తెచ్చారని, రూ.లక్షకు పైగా అవినీతికి పాల్పడితే జైలు శిక్ష తప్పదనే విషయాన్ని గుర్తుంచుకొని బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి జాబ్‌కార్డుల ద్వారా పనులు జరిగినట్లు డబ్బు లు డ్రా చేస్తున్నారని, వీటిని సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

దివ్యాంగులకు ప్రత్యేక చట్టాలు: ఎస్‌ఐ



కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ మునీర్ అహమ్మద్

చిలమత్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వారిని అగౌరవపరిచే విధంగా మాట్లాడటం, బాధపెట్టడం చేయరాదని ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని దివ్యాంగులు, స్థానిక నాయకులు కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరక వైకల్యం తప్పా బుద్ధికి కాదని, వారు ఎంతో మేధావులన్నారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ శ్రీదేవి, నందీశప్ప, లక్ష్మీదేవి, తిప్పారెడ్డి, ఆంజనేయులు, రామాంజి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజ్‌కుమార్

మడకశిర రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ఏఆర్ రొప్పం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంగాలని, సెల్ ఫోన్ల వాడకం తగ్గించాలని, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

నేడు మందలపల్లిలో రెవెన్యూ సదస్సు

గుడిబండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కరుణాకర్, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి తెలిపారు. రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సుకు హాజరై తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవాలని వివరించారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

పావగడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు 50 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు బగర్‌హుకుం చట్టం కింద పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. తాలూకా వ్యాప్తంగా మూడువేల మందికి పైగా బగర్‌హుకుం కమిటీకి అర్జీలు దరఖాస్తు చేసుకొన్నప్పటికీ కేవలం 900 మందికి మాత్రమే చట్టబద్ధం చేసి మిగిలినవన్నీ రద్దు చేశారని తెలిపారు. రద్దు చేసిన పట్టాలన్నీ చట్టబద్ధం చేసి రైతులకు అనుకూలంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తుమకూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లాలోని రైతులందరూ పెద్దఎత్తున ధర్నా చేపడుతున్నట్లు తహసీల్దార్‌కు తెలిపారు. వందలాది మంది రైతులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి అనంతరం వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ



మిరప పంటను పరిశీలిస్తున్న ఉష శ్రీచరణ్

పరిగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఊటకూరు పంటపొలాల్లో ఆమె పర్యటించారు. పంట సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నామం టూ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, మిరప పండించిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహమూర్తి, అమరావతి, శివశంకర్ పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న సర్పంచు, గ్రామస్థులు

గుడిబండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప, బీట్ ఆఫీసర్ సంజీవరాయుడుపై గుడిబండ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు గుడిబండ గ్రామానికి వెళ్లారు. గ్రామంలోకి చిరుత వస్తున్నా దానిని బంధించి ఇతర ప్రాంతాలకు ఎందుకు తరలించలేకపోతున్నారని అటవీ శాఖ అధికారులను సర్పంచ్ కరుణాకర్‌గౌడ్, టీడీపీ నాయకుడు శ్రీరామప్ప, గ్రామస్థులు నిలదీశారు. చిరుత గ్రామస్థులు, పశువులపై దాడి చేస్తోందని ఎన్నిసార్లు విన్నవించినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వెంటనే చిరుత, ఎలుగుబంట్లను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఈవిషయమై ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప మాట్లాడుతూ చిరుత ఒకేచోట ఉండదని, ఎప్పుడో ఒకసారి కనపడితే దొరకడం కష్టంగా ఉందన్నారు. బంధించి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు.

యూటీఎఫ్ విజయోత్సవాలు



అంబేద్కర్ సర్కిల్లో యూటీఎఫ్ నాయకుల సంబరాలు

పెనుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ మద్దతుదారుడు బోర్ల గోపీమూర్తి విజయం సాధించడంపట్ల పెనుకొండ యూటీఎఫ్ నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, కృష్ణానాయక్, నవీన్, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, గంగాధర్, ఆది, దినేష్, రాజశేఖర్, వెంకటేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూ టర్న్ వద్ద లారీల ఢీ

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లగొండ్రాయనపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. సోమందేపల్లి యూ టర్న్ వద్ద జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ గోరక్ తీవ్రంగా గాయపడ్డాడు. పెనుకొండ వైపు నుంచి తుమకూరుకు బంగాళా దుంపల లోడుతో బయలుదేరిన లారీ డ్రైవర్‌కు దారి తెలియకపోవడంతో సోమందేపల్లి దాటి వెళ్లాడు. అక్కడ విచారిస్తే హిందూపురం మీదుగా వెళ్లాలని తెలపడంతో సోమందేపల్లికు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి యూ టర్న్ వద్ద లారీని మలుపుతిప్పాడు. డివైడర్‌కు లారీ తగులుకుని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. అదే సమయంలో బెంగళూరు వైపు నుంచి వస్తున్న మరోలారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో బంగాళా దుంపల లారీ డ్రైవర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ట్రాఫిక్ స్తంభించి వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడ్డ డ్రైవర్‌ను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజేతగా.. జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారిణులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్‌లో ఈనెల 8న జరిగిన రాష్ట్ర స్థాయి లగోరి క్రీడాపోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని లగోరి క్రీడల జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, లగోరి క్రీడల రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్‌సాయి, కార్యదర్శి వెంకటబాదులు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించారు.

మాజీ డీలర్ నుంచి స్కేల్ స్వాధీనం

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సోమవారం సోమందేపల్లి మండల పరిధిలోని పత్తికుంటపల్లి మాజీ డీలర్ సుశీలమ్మ నుంచి సీఎస్‌డీటీ మోహన్, సిబ్బంది పోలీసుల సహాయంతో స్కేల్ స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత డీలర్ క్రిష్ణవేణి ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న స్కేలును కొత్త డీలర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి: సీడీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి

గుడిబండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎస్.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని మండలంగా గుడిబండను త యారు చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు చిన్నవయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడి, ప్రసవ సమయంలో తల్లిబిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తి, ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.